క్లుప్తంగా

నకిలీ ధ్రువపత్రాలపై విచారణ

అమ్రాబాద్: ఏజెన్సీ ప్రాంతంలో నకిలీ ధ్రువపత్రాలపై ఉద్యోగాలు పొందిన వారిపై విచారణ చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ మాధవి మంగళవారం అమ్రాబాద్ తహసీల్దార్ శైలేంద్రనాథ్, పదర తహసీల్దార్ సూరిబాబులకు ఆదేశించారు. ఆయా మండల కేంద్రాల్లో నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందారని మండలాలకు చెందిన నాయకులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆమె స్పందించి తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని డీకేఆర్ పంక్షన్‌హాల్‌లో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్‌కు చెందిన డా బన్నీదేవి, మల్లురవి, డా రేవ, డా మోహన్‌బాబు, ప్రసాద్ చౌదరిలు హాజరై ప్రసంగించారు. ఇతరులతో ప్రేమ, కరుణతో మెలగాలని సూచించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్ జాన్ బుచ్చయ్య, కౌల్‌రాజు, వేదాంతిబాబు, సామ్యూల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

బల్మూర్: తెలంగాణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అరుణకుమార్, పి.శ్రావిక, డి. స్వామిలు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి పొందారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

లింగాల: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం మండల స్థాయి అధికారులు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండలంలోని లింగాల, జీలుగుపల్లి, రాయవరం తదితర గ్రామాల్లో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్ పర్యటించారు. బూత్‌లలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను, కల్పించాల్సిన వసతుల గురించి చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో బిడ్డ ఎదుగుదల



కోడేరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని డాక్టర్ దశరథం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పండ్లు, ఆకుకూరలు తీసుకోవడంతో బిడ్డ ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. అనంతరం వివిధ రకాల టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యునాని డాక్టర్ తయాబ్, ల్యాబ్ టెక్నీషియన్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని లయన్స్ భవనంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి రెడ్డి సేవా సమితి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన మిడ్జిల్ అల్వాల్‌రెడ్డిని సేవా సమితి నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శేకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు తీరు సరికాదు

చారకొండ: బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు సరికాదని నియోజక వర్గ యువజన నాయకులు వంగూర్ రాజేష్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వల్లే గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు కాలేదన్నారు. పంచాయతీ రాజ్ శాఖ నిధులను ఇతర శాఖలకు మళ్లించిన ఘటన బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యలతో సతమతం



తాడూరులో ప్రధాన రోడ్డు వెంట పారుతున్న మురుగు

ప్రత్యేకాధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. కనీస వసతులు కల్పించడంలో అధికారుల, పాలకులు విఫలం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుధ్యం, విద్యుత్, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు తిష్ట వేశాయి. రోడ్ల వెంట మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పలు గ్రామాల్లో డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. మండల కేంద్రంలోని 2, 3వ వార్డులో నెల రోజులు నుంచి వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

–తాడూరు

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

కందనూలు: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలోని అయ్యప్పదేవాలయంలో మంగళవారం అయ్యప్ప మహాపడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు అయ్యప్పమాలధారులు అని కొనియాడారు. ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు గోపాలకృష్ణ, సుందర్, ప్రవీణ్, దర్శన్, భక్తులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో కొనసాగింది. గురుస్వామి కేతేపల్లి వెంకటేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అంజనీమాత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మండికారి బాలాజీ, అధ్యక్షురాలు రాజపుత్ర సునీతాబాయి, గోరక్షా ప్రముఖ్ రంగినేని రవీందర్, మల్లయ్య, వెంకటేష్, హేమలత, ఆంజనేయులు పాల్గొన్నారు.

తపాలా సేవలపై అవగాహన



అచ్చంపేట పోస్టాఫీసు వద్ద విద్యార్థులు

అచ్చంపేట రూరల్: తపాలా సేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి అన్నారు. మంగళవారం పట్టణంలోని పోస్టాఫీసు వద్ద తపాలా సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటన ద్వారా విద్యార్థులకు పూర్తి అవగాహన వస్తుందన్నారు. తపాలా ప్రాముఖ్యత, అందిస్తున్న బీమా సౌకర్యాలు, పొదుపు వంటి తదితర సేవల గురించి వివరించారు. ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, ఆశాబేగం, షహనాజ్ సుల్తానా పాల్గొన్నారు.

బోధన, బోధనేతర సిబ్బంది సమ్మె

లింగాల: సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కస్తూర్బా విద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని, పనికి తగ్గ వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా తమకు అన్ని సదుపాయాలు కల్పించాలని మహిళా ఉద్యోగులు డిమాండ్ చేశారు.



సమ్మెలో పాల్గొన్న బోధనేతర సిబ్బంది

విద్యార్థులు ఆటపాటలతో కాలక్షేపం

మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో దాదాపుగా బోధన, బోధనేతర సిబ్బంది 25 మంది వరకు, 300లకు పైగా విద్యార్థినులు ఉన్నారు. కాగా విద్యార్థినులు ఇబ్బందులు పడకుండా కేవలం బోధనేతర సిబ్బంది మాత్రం విధులు నిర్వహిస్తున్నారు. తరగతుల నిర్వహణ లేక పోవడంతో విద్యార్థినులు ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాందిన్నె, చంద్రబండతండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ప్రత్యేక యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, మాజీ సర్పంచ్‌లు రాములాల్, అరవింద్, శ్రీకృష్ణ, చంద్రయ్య, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంతో పాటు జూపల్లి, శాంతిగూడెం గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పంచాయతీ కార్యదర్శులు స్థానిక నాయకులతో కలిసి సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ నెల 30 నాటికి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గణేష్, శ్రావణ్, ఆల్తాఫ్ నాయకులు నాగేంద్ర తదితరులు ఉన్నారు.



శాంతిగూడెంలో సర్వే చేస్తున్న అధికారులు

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాదవ శాత్తు మరణిస్తే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, చిన్నపాగ శ్రీనివాసులు, కపిలవాయి గోపి, కురుమయ్య, విజయ్‌కుమార్, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వల్లంపల్లి జైపాల్‌రెడ్డి

బీజేపీని బలోపేతం చేద్దాం

వెల్దండ: గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేద్దామని కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొట్ర, రాచూర్ తదితర గ్రామాల్లో బూత్ కమిటీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ దేశంలో పేదల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన వారందరికి అందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, జంగయ్యయాదవ్, శ్రీనివాసచారి, వెంకటనారాయణ, రాజుచారి, సురేష్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, శివకుమార్ తదితరులు ఉన్నారు.



బూత్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న శేఖర్‌రెడ్డి

నర్సరీ పనుల్లో వేగం పెంచాలి

చారకొండ: నర్సరీలలో పనులు వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని సిర్సనగండ్ల, రామచంద్రాపురంలో మంగళవారం నర్సరీలను ఆయన పరిశీలించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రధానరహదారి వెంట ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటయ్య, ఏపీఓ లక్ష్మణ్, ఉపాధి అధికారులు తదితరులు ఉన్నారు.

సమ్మెకు ఏఐఎస్‌ఎఫ్ మద్దతు

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షాఅభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు.

జానపద కళలను కాపాడుకుందాం

కల్వకుర్తిరూరల్: జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం అన్నారు. మంగళవారం పట్టణంలో ఫోక్‌సింగర్ డీజే శివను శాలువాతో సత్కరించారు. సినిమా పాటలకు ఏమాత్రం తగ్గకుండా పల్లెపాటలను నూతన టెక్నాలజీ ఉపయోగించి అద్భుతంగా శివ చిత్రీకరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాహేర్‌అలీ, నాయకులు శ్రీధర్, శివ, భరత్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

నూతన భవనంలోకి మార్పు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం నూతనంగా నిర్మించిన భవన సముదాయంలోకి మార్చినట్లు తహసీల్దార్ జేకే మోహన్ తెలిపారు. బుధవారం కొత్త కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తునట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు గమనించాలని కోరారు.

వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

మన్ననూర్: స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ అవకాశం కల్పించాలని ఆ సంఘం జాతీయ వేదిక నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదింపజేయాలని కోరారు. వికలాంగులకు రూ. 6 వేల పింఛన్ అమలు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

తెలకపల్లి: మండలంలోని కార్వంగ గ్రామానికి చెందిన రవీందర్ మంగళవారం నాగర్‌కర్నూల్‌లో పురుగుల మందు తాగి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య తదితరులు ఉన్నారు.

వాసవీక్లబ్ ఇంటర్నేషనల్‌లో ఇద్దరికి చోటు

కల్వకుర్తిరూరల్: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గాన్ని మధురైలో ఇటీవల ఎంపిక చేశారు. కల్వకుర్తికి చెందిన జూలూరి రమేష్‌బాబు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అడ్మినిస్ట్రేటర్‌గా, కల్వ హరికృష్ణ జాయింట్ సెక్రెటరీగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మంగళవారం వారికి శుభాకాంక్షలు తెలిపారు.



రమేష్‌బాబు



హరికృష్ణ

మంత్రి, ఎంపీని కలిసిన నాయకులు

తాడూరు: ఎక్సైజ్ పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవిని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్‌కుమార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్‌లు మంగళవారం హైదరాబాద్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల చివరి వారంలో వనపర్తి జిల్లా కేంద్రంలో పాల్‌టెక్నిక్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాకు సంబంధించిన విషయాలపై వారితో చర్చించారు. నాయకులు రాము, మహేష్, వంశీ, మాజీ సర్పంచ్ వెంకటయ్య, గణేష్, అన్వర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు నల్లమల విద్యార్థి

అచ్చంపేట రూరల్: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు నల్లమల ప్రాంతానికి చెందిన విద్యార్థి శ్రీమంత్ ఎంపికయ్యాడు. పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఇప్పటికే అండర్–14 ఉమ్మడి జిల్లా జట్టులో చోటు దక్కింది. రాష్ట్ర స్థాయిలో పోటీలో రాణిస్తే రంజీ స్థాయిలో ఆడే అవకాశం ఉంది. మంగళవారం ఉపాధ్యాయులు సూర్య, రాము, పీఈటీ శ్రీను, హలీమా, బాలు, భాస్కర్‌లు విద్యార్థి శ్రీమంత్‌ను అభినందించారు.



బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన



కల్వకుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న చైర్మన్ సత్యం, తదితరులు

సాక్షి, నెట్‌వర్క్: లగచర్లలో రైతులపై జరిగిన దాడిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అచ్చంపేటలో అండేద్కర్ విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ వినతిపత్రం అందజేశారు. తెలకపల్లి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. వెల్దండలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, కల్వకుర్తి, కొల్లాపూర్, తాడూరు, తిమ్మాజిపేటలో అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్వకుర్తిలో మున్సిపల్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో..



తాడూరులో..

పంచాయతీ వర్కర్ల ముందస్తు అరెస్టు



నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌లో ఆవరణలో కార్మికులు, సీఐటీయూ నాయకులు



కోడేరులో..

సాక్షి, నెట్‌వర్క్: పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్మికులు హైదరాబాద్ తరలివెళ్లకుండా పోలీసులు కార్మికులను ముందస్తు అరెస్ట్ చేశారు. నాగర్‌కర్నూల్‌లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య కార్మికులకు మద్దతు ప్రకటించారు. కొల్లాపూర్, బల్మూరు, వెల్దండ, కోడేరులలో కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

విద్య, ఆరోగ్యంపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని రైతు వేదికలో నార్లాపూర్ చెంచు గూడెం, మొలచింతపల్లి చెంచుగూడెం, అమరగిరి చెంచుగూడెం, ఎల్లూరు చెంచుగూడెంకు చెందిన చెంచులకు విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, వ్యవసాయంపై ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ చిన్న హుస్సేన్, ఆర్డీటీ సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ రాముడు, తదితర చెంచులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీలకు అవకాశం కల్పించాలి

అచ్చంపేట: అక్రిడేషన్ కమిటీలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని మంగళవారం తెలంగాణ అంబేద్కర్ మీడియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌కు, డిప్యూటీ డైరెక్టర్ చరణ్‌దాస్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుఫెడరేషన్ ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్, రాములునాయక్‌లు వారిని కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించారు. రాష్ట్రంలోని అన్ని మీడియా కమిటీల్లో, అక్రిడేషన్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర పౌర సంబంధాల శాఖ జారీ చేసే ప్రకటనల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద బడ్జెట్‌ను కేటాయించి ఎస్సీ, ఎస్టీ పత్రికలకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రైతు నేస్తానికి రైతులు గైర్హాజరు



తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు గైర్హాజరయ్యారు. రైతులు ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు మాత్రం కొంత సమయం కూర్చొని వెళ్లారు. ముందు జాగ్రత్తగా రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నారు. కార్యక్రమ ఉద్దేశ్యం నీరుగారుతోందని పలువురు విమర్శించారు. ఈ విషయమై సంబంధిత అధికారికి సంప్రదించగా ఫోన్ లిఫ్ట చేయలేదు.

అదుపుతప్పిన బొలెరో: తప్పిన ప్రమాదం

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ సమీపంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై బొలెరో వాహనం వెనకటైర్ పగిలి బోల్తా పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాదు నుంచి కొల్లాపూర్‌కు ఫెర్టిసైడ్ మందులతో బొలెరో వాహనం వెళ్తోంది. మార్గమధ్యలో మండలం పెద్దాపూర్ సమీపంలో టైర్ పగిలి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంకటయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కానిస్టేబుల్‌లు కృష్ణ, మల్లేష్‌లు ఘటన స్థలానికి చేరుకొని ఫెర్టిసైడ్ బాక్స్‌లను మరో ఆటోలో ఎక్కించి ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఇద్దరికి రిమాండ్

తెలకపల్లి: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15న లింగాల్‌రోడ్డులోని భారత పెట్రోల్ బంక్ వద్ద మండల కేంద్రానికి చెందిన రజినీకాంత్, కొంగరి జయప్రకాష్‌లు గొడవ పడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. ఇద్దరు ఎంతకీ వినకపోవడంతో పాటు కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారు. కానిస్టేబుల్ రేణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఇద్దరిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారులపై వీధికుక్క దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: ఆడుకుంటున్న చిన్నారులపై వీధికుక్కలు దాడికి పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నెల్లికొండలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు నెల్లికొండ గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటున్నారు. వీధి కుక్క ఆకస్మాత్తుగా చిన్నారులపై దాడి చేసి గాయపర్చింది. గ్రామానికి చెందిన కూరగాయలు విక్రయించే జానమ్మను కరిచింది. గాయపడిన చిన్నారులను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమూర్తి వివరాల ప్రకారం హైదరాబాదులోని మల్కాజిగిరికి చెందిన సూర్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కొట్రగేట్ సమీపంలోని నక్షత్ర హోటల్ వద్ద వాహనం నిలిపారు. రోడ్డు దాటుతున్న సూర్యనారాయణమూర్తిని శ్రీశైలం నుంచి హైదరాబాదు వెళ్తున్న మరోకారు ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చేవెళ్లకు చెందిన కారు డ్రైవర్ కంచర్ల తేజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.